
- మంత్రులు జూపల్లి, పొంగులేటితో చర్చలు
- వరంగల్ ఎంపీ టికెట్‌పై హామీ ఇచ్చినట్లుగా ప్రచారం
- త్వరలో కాంగ్రెస్ గూటికి చేరే అవకాశం
- మరో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పక్కచూపులు
- ఎంపీ టికెట్ హామీతో బీజేపీ నేతల మంతనాలు
- నర్సంపేట బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు బీజేపీలో చేరిక
- లోక్‌సభ ఎన్నికల వేళ గులాబీ పార్టీకి భారీ ఝలక్



'కారు'లో కుదుపు

బీఆర్‌ఎస్‌కు మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య రాజీనామా

వరంగల్ (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

లోక్‌సభ ఎన్నికల వేళ.. బీఆర్‌ఎస్‌కు భారీ షాక్ తగిలింది. స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే, మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కకపోవటంతో పాటు వరంగల్ ఎంపీ సీటుపై అధిష్ఠానం తిరకాసు పెడుతుండటంతో ఆగ్రహంతో ఉన్న రాజయ్య.. శనివారం పార్టీకి రాజీనామా ప్రకటించారు. నాలుగైదు రోజులుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో పాటు మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివా‌స్‌రెడ్డితో రాజయ్య సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. తాటికొండ చేరికకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి గ్రీన్‌సిగ్నల్ రావటంతో శనివారం గులాబీకి గుడ్‌బై చెప్పారు. కాగా, నర్సంపేట బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఐదు గురు కమలం గూటిలోకి చేరేందుకు రెడీ అవుతుండగా, మరో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పక్క చూపులు చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో గులాబీ పార్టీలో గుబులు రేగుతోంది.

కారు దిగిన తాటికొండ

స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. ఈమేరకు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌కు శనివారం తన రాజీనామా లేఖ పంపించారు. 1997లో కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయ జీవితాన్ని ప్రారంభించి రాజయ్య.. 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి కడియం శ్రీహరి చేతిలో ఓటమిపాలయ్యాడు. 2004 మహాకూటమి పొత్తులో భాగంగా రాజయ్యకు టికెట్ దక్కలేదు. 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేసి రెండోసారి ఓటమి పాలయ్యాడు. అయితే 2009లో జరిగిన ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా తొలిసారిగా విజయం సాధించారు. ఆ తరువాత తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న రాజయ్య.. 2011 అక్టోబరు 30వ తేదీన బీఆర్‌ఎస్‌లో చేరారు. అదే రోజు తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేరారు. 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో రాజయ్య రెండోసారి బీఆర్‌ఎస్ నుంచి పోటీచేసి టీడీపీ అభ్యర్థి కడియం శ్రీహరిపై 48,641 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2014, 2018 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించారు. వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యే గెలిచిన రాజయ్యకు 2014లో బీఆర్‌ఎస్ తొలి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రిగా, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. అయితే కొన్ని కారణాలతో రెండేళ్లకే రాజయ్య పదవిని కోల్పోవాల్సి వచ్చింది. అయినప్పటికీ గులాబీ పార్టీలోనే కొనసాగుతూ వస్తు న్న రాజయ్యకు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ టికెట్ నిరాకరించింది. ఎన్నికల ముందు కూడా రాజ య్య చుట్టూ వివాదాలు చక్కర్లు కొట్టాయి. దీనికితోడు కడియం శ్రీహరితో ఉన్న విభేదాలను మీడియాతో పంచుకోవటంతో రాజయ్యపై అధిష్ఠానం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ అధిష్ఠానం 2023 అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఇవ్వకుండా కడియం శ్రీహరిని స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థిగా నిలబెట్టింది. రాజయ్యకు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ ఎంపీ టికెట్‌పై హామీతోపాటు రైతు సమన్వయ సమితి (రైతుబంధు) రాష్ట్ర చైర్మన్‌గా నియమించారు. అయితే రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పడిపోవటంతో పాటు బీఆర్‌ఎస్ తనకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునే అవకాశాలు లేకపోవటంతో రాజయ్య కారు దిగినట్లుగా ప్రచారం జరుగుతోంది.

గులాబీపై గుస్సా

గులాబీ పార్టీపై రాజయ్య కొంతకాలంగా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి అవకాశం ఇస్తామని గులాబీ అధిష్ఠానం ఇచ్చిన హామీ కూడా నెరవేరే పరిస్థితి కనిపించటం లేదు.అంతేకాక స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్యకు వరంగల్ ఎంపీ సీటు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనికితోడు వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ సైతం వరంగల్ ఎంపీ టికెట్ కోసం గులాబీ అధిష్ఠానంపై ఒత్తిడి తీసుకవస్తున్నారు. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకున్న రాజయ్య.. తన రాజకీయ భవిష్యత్తు కోసం పాత పార్టీ వైపు మొగ్గు చూపారనే టాక్ వినబడుతోంది.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివా‌స్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావులను కలిసినట్లుగా సమాచారం. వారి నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో కాంగ్రెస్‌లో చేరికకు సిద్ధమైనట్లుగా సమాచారం. కాగా, ఇప్పటికే వరంగల్ ఎంపీ సీటు కోసం కాంగ్రెస్ సీనియర్లు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ రిజిస్ట్రార్ హరికోట్ల రవి సైతం టికెట్ కోసం ఏకంగా సోనియాగాంధీనే కలిసి వచ్చారు. ఈ క్రమంలో రాజయ్యకు వరంగల్ ఎంపీ టికెట్‌పై హామీ ఇచ్చారా? లేక రాజకీయ భవిష్యత్తు కోసం బీఆర్‌ఎస్ నుంచి బయటకు రావాలని నిర్ణయం తీసుకున్నారా? అనేది చర్చనీయాంశంగా మారింది.

బీజేపీ టచ్‌లోకి మాజీ ఎమ్మెల్యే..?

తాటికొండ రాజయ్య ఎపిసోడ్ ఓరుగల్లు రాజకీయాల్లో హాట్‌హాట్‌గా మారుతున్న వేళ.. మరో మాజీ ఎమ్మెల్యే కూడా గులాబీ పార్టీ ఝలక్ ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన ఓ నేత వరంగల్ ఎంపీ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయితే స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కుమార్తెను ఎంపీ బరిలో దింపేందుకు అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్న క్రమంలో సదరు మాజీ ఎమ్మెల్యేకు బీజేపీ నేతలు టచ్‌లోకి వచ్చినట్లుగా సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో మోదీ గాలి వీచే అవకాశం ఉండటంతో బలమైన అభ్యర్థిని బరిలో దించాలని కమలం పార్టీ వ్యూహం రచిస్తోంది. టికెట్‌తో పాటు ఎన్నికల్లో ఖర్చులో కొంత భరించేందుకు సిద్ధమని కూడా కాషాయ పార్టీ నుంచి హామీ లభించినట్లుగా తెలిసింది. దీంతో ఆ గులాబీ మాజీ ఎమ్మెల్యే ఆలోచనలో పడ్డట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయం తెలుసుకున్న గులాబీ పెద్దలు.. ఆ మాజీ ఎమ్మెల్యేతో చర్చలు జరుపుతున్నట్లుగా తెలిసింది. ఒక వేళ చర్చలు విఫలమైతే కారు పార్టీలో మరో భా రీ కుదుపు తప్పదనే చర్చ జరుగుతోంది. అలాగే నర్సంపేట నియోజకవర్గానికి చెందిన ప్రతాప్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు.

ప్రతాప్‌రెడ్డితోపాటు నర్సంపేట పట్టణానికి చెందిన ఐదుగురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు సైతం ఆ పార్టీకి ఝలక్ ఇచ్చి బీజేపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఇటీవలే భూపాలపల్లికి చెందిన ఆరుగురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌లు కారు దిగి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో వరుసగా బీఆర్‌ఎస్‌కు వలసలతో నేతలు షాకులు ఇస్తుండటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో గులాబీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.





మానుకోటలో వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సవ్ టొప్పో

సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌ను పక్కాగా రూపొందించాలి

- వేసవిలో తాగునీటికి కొరత రాకుండా చూడాలి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క

మహబూబాబాద్, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి) : సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను పకడ్బందీగా రూపొందించాలని, వేసవిలో తాగునీటి కొరత రాకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళాశిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ములుగు కలెక్టర్ కార్యాలయం నుంచి మంత్రి, పంచాయతీరాజ్ కమిషనర్ హనుమంతరావు, హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్‌శాఖ గ్రామీణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానీయా జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవి కాలంలో నీటి ఎద్దడిరాకుండా పటిష్టమైన ప్రణాళికల రూపకల్పనపై చర్చించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో నీటిఎద్దడి తలెత్తకుండా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేకాధికారులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి పారిశుధ్యం, నీటిసమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టి బెల్ట్‌షాపులు, గంజాయి, గుట్కావంటి దురాలవాట్లకు యువతను దూరంగా ఉంచేలా చైతన్యవంతం చేస్తూ ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. అటవీ గ్రామాల్లో నీటికొరత రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. జాతర్లలో భక్తులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించేందుకు స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్డర్స్ ఇవ్వాలన్నారు. రోడ్లు శుభ్రంగా ఉంచడం, మొక్కలు నాటించడం, నర్సరీల నిర్వహణ జరగాలన్నారు.

పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానీయా మాట్లాడుతూ ఇంటింటి చెత్తసేకరణ తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్పెషల్‌డ్రైవ్ చేపట్టి.. నీటి ట్యాంక్‌లను, డ్రైన్స్‌ను శుభ్రపర్చి బ్లీచింగ్ చల్లించాలన్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ వివరిస్తూ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించి, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మిషన్‌భగీరథ, పంచాయతీ శాఖలతో నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ వనరుల ద్వారా నీటికొరత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ టొప్పో, జిల్లా అధికారులు రమాదేవి, సన్యా సయ్య, హరిప్రసాద్, సురేష్, సురేందర్, కృష్ణారెడ్డి, వరలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే భరోసా

- జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు



మాట్లాడుతున్న డీఈవో రామారావు

కొత్తగూడ, ఫిబ్రవరి 3 : విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే భరోసా అని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) రామారావు అన్నారు. ఓటాయిలోని ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే బాధ్యత టీచర్లదేనని పేర్కొన్నారు. ప్రాథమికస్థాయి నుంచే విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావం, సమయపాలన, పట్టుదల పాటించాలన్నారు. నిజాయితీతో కూడిన జీవన విధానాన్ని అలవరుచుకోవాలన్నారు. సమాజంలో ఉన్నతపౌరులుగా గుర్తింపు పొందాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు మల్లెల సాంబయ్య, కాంప్లెక్స్ ఉపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు రేణేశ్వర్, ఎల్లస్వామి, పూర్వ విద్యార్థి ధనసరి పాపయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 3 : జిల్లా కేంద్రంలోని పాతబజారులో ఉన్న పలు కాలనీ ల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏఈ సంగీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయాకాలనీల్లో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా, ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని గుండ్లకుంట కాలనీ, నందినగర్, నర్సంపేట బైపాస్ రోడ్డు, ఏటిగడ్డతండా, ఎల్‌బీజీ నగర్, గిరిప్రసాద్‌నగర్, కంకరమిల్లు, రాంచంద్రాపురం, బస్టాండ్, డిగ్రీ కళాశాల ఏరియా, ఆకుల లక్ష్మయ్యకాలనీ, అంబేద్కర్‌కాలనీ, ఈదులపూసపల్లి రోడ్డుల లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉండనున్నట్లు చెప్పారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సైన్స్ పట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్



గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్నదృశ్యం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 3 : పాఠశాలస్థాయి నుంచే విద్యార్థులకు సైన్స్‌పట్ల ఆసక్తిని పెంపొందించే విధంగా, బోధన చేయాలని అదనపు కలెక్టర్ డేవిడ్ సూచిం చారు. మానుకోటలోని రవిచంద్ర కన్వెన్షన్ హాల్‌లో శనివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల పోటీలను నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు తడక మల్ల బ్రహ్మం అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను వైద్యులు బానోత్ నెహ్రూరాథోడ్, బోనగిరి అనిల్‌గుప్తా ఆవిష్కరించి, ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన ముగింపు సమావేశంకు హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమొంటోలను అందజేశారు. జిల్లా ఆస్పత్రి సూపరిండెంట్ వెంకట్రాములు, వైద్యులు బానోత్ నెహ్రూరాథోడ్, బోనగిరి అనిల్‌గుప్తా దంపతులు, జేవీవీ బాధ్యులు విశ్రాంత ప్రొఫెసర్ రాములు, మంగపతిరావు, మైన నాగయ్య, లింగంపల్లి దయానంద్, సాహితీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజల వద్దకు ఎమ్మెల్యే

- పట్టణంలోని నున్నా నారాయణకాలనీ, గాంధీపురంలో సమావేశాలు
- కాంగ్రెస్ పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



గాంధీపురం సభలో ప్రజలనుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 3 : ప్రజాసమస్యలను తెలుసుకుని, పరిష్కారం చూపేందుకు మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. మున్సి పల్ పట్టణం నాలుగోవార్డు పరిధిలో సమావేశాలు ఏర్పాటు, చేసి ప్రజాసమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. తొలుత నున్నానారాయణ కాలనీకి చేరుకుని అక్కడ ప్రజాసమస్యలు తెలుసుకున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ కాలనీ మొత్తంగా వేయకపోవడంతో సగం కాలనీ వాసులకు మాత్రమే తాగునీరు అందుతుందని సీపీఎం ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య, జిల్లా కమిటీ సభ్యుడు సమ్మెట రాజమౌళి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికితోడు సీసీ రోడ్డు, సైడ్‌కాల్వలు కట్టించాలని, జీవో నెంబరు 58 ద్వారా ఇళ్ల పట్టాలిప్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మురళీనాయక్ అధికారులతో మాట్లాడి, ఇళ్ల పట్టాలిప్పించేలా చూస్తానని చెప్పారు.

అనంతరం గాంధీపురంలో ఎమ్మెల్యే సమావేశాన్ని నిర్వహించారు. 287 సర్వే నెంబర్‌లో అనేక ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలిప్పించాలని రైతులు కోరారు. జీవో నెంబర్ 58,59 ద్వారా ఇంటి పట్టాలిప్పించాలని, కొత్తగా విద్యుత్‌పోళ్లను వేయించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. తాగునీటి సమస్య కూడా ఉందని ఎమ్మెల్యేకు వివరించారు. పూర్వంలో ఉన్న లిఫ్టిఇరిగేషన్ గత పదేళ్లుగా మూలకుపడిందని, అది పనిచేస్తే రెండుపంటలు పండుతాయని చెప్పారు. వెంటనే అధికారులతో కలిసి ద్విచక్రవాహనంపై అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజల వ్దదకు పాలన..

ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపేందుకు అధికారులతో కలిసి గ్రామాలకు వచ్చామని, తద్వారా ప్రజలకు వద్దకు పాలన అమలవుతుందని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. వేసవిలో భూ గర్భజలాలు అడుగంటి తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో పార్టీల కతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.7లక్షల కోట్ల అప్పులు చేసిందని ఆరోపించారు. తొలుత ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 18 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

ఆయా కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు సమ్మిరెడ్డి, విజయ్ కుమార్, ఉపేందర్, సురేష్, కృష్ణప్రసాద్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ భూక్య ఉమా, అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, మండల అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, ఖలీల్‌పాష, కౌన్సిలర్లు పోతురాజు రాజు, హరిసింగ్, కోడి శ్రీను, దండెబోయిన బుజ్జి వెంకన్న, ఎడ్ల రమేష్, జగన్, బావుసింగ్, ఉపేంద్రాచారి, రామకృష్ణ పాల్గొన్నారు.

మరో రెండు గ్యారెంటీలను అమలు చేస్తాం

- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్
- ఎడ్జర్లలో నూతన జీపీ భవనం ప్రారంభం



ఎడ్జర్లలో నూతన జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న రామచంద్రునాయక్

మరిపెడ రూరల్, ఫిబ్రవరి 3 : అతిత్వరలో మరో రెండుగ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్ అన్నారు. శనివారం ఎడ్జర్లలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే రెండుపథకాలు ప్రారంభించామని, మరో రెండురోజుల్లో క్యాబినెట్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మరో రెండు పథకాలు, తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతీ మహిళకు రూ.2500, ప్రతి గృహానికి రెండువందల యూనిట్లు విద్యుత్ ఉచితంగా ఇస్తామన్నారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లీ రఘువీరారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవినాయక్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు మల్లికంటి రాజు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు అజ్మీరా శ్రీను, జిల్లా నాయకుడు నూకల శ్రీరంగారెడ్డి, షేక్ అఫ్జల్, యమ్డీ అఫ్సర్, పెన్‌పవర్ సురేష్, మాజీ సర్పంచ్ చిత్తనూరి అనూష వెంకన్న పాల్గొన్నారు.

కురవి : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. అయ్యగారిపల్లిలో మండలం జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఇండ్ల స్థలాలు కేటాయించాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం, ఐజేయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్, జర్నలిస్టులు బాలగాని నవీన్, సురేష్, శ్రీధర్, ప్రమోద్, నర్సయ్య, రోశయ్య, రంజిత్, ఖాజా, కాకి వెంకట్‌రెడ్డి, బి.వీరన్న పాల్గొన్నారు.

5 నుంచి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు

డోర్నకల్, ఫిబ్రవరి 3 : సికింద్రాబాద్ డివిజన్‌లోని మౌలాలి రైల్వేస్టేషన్ వద్ద రైల్వేట్రాక్ మరమ్మతుల దృష్ట్యా ఈనెల 5వ తేదీ నుంచి 11 వరకు ఇంటర్‌సిటీ, శాతవాహన, కాకతీయ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. అలాగే సికింద్రాబాద్-గుంటూరు మధ్య నడిచే గోల్కోండ ఎక్స్‌ప్రెస్‌ను కాజీపేట నుంచి గుంటూరు మధ్య నడపనున్నట్లు తెలిపింది. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి రైల్వేకు సహకరించాలని కోరారు.

బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిక

'కాషాయ' తీర్థం పుచ్చుకున్న ఐదుగురు కౌన్సిలర్లు



నర్సంపేట నాయకులకు బీజేపీ కండువాను కప్పుతున్న కిషన్‌రెడ్డి

నర్సంపేట, ఫిబ్రవరి 3 : వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నర్సంపేట నియోజకవర్గ యూత్ కన్వీనర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డితోపాటు ఐదుగురు కౌన్సిలర్లతో సహా 55 మంది కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో శనివారం హైదరాబాద్‌లో బీజేపీలో చేరారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీకి 13మంది కౌన్సిలర్లు రాజీనామా చేసిన విషయం విదితమే. వీరంతా హైదరాబాద్‌కు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులతో కలిసి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్లు శీలం రాంబాబు, జుర్రరాజు, మినుముల రాజు, బోడ గోల్యానాయక్, నూనావత్ కవితవీరన్న, దుగ్గొండి మండలం మహ్మదాపురం సొసైటీ వైస్ చైర్మన్ పాలడుగుల జీవన్‌తో సహా 55మందికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీజేపీ నేత ఈటల రాజేందర్ సైతం వారిలో ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి రాణిరుద్రమరెడ్డి, నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, యువ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ జూలూరి మనీష్‌గౌడ్, యువ మోర్చా పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, రాంచందర్ రెడ్డి, కోమాండ్ల సప్తగిరి, వనపర్తి మల్లయ్య పాల్గొన్నారు.

మారిన రాజకీయాలు

నర్సంపేట మునిసిపల్ చైర్ పర్సన్ గుంటి రజనిపై గతనెల 2న 13 మంది కౌన్సిలర్లు కలెక్టరేట్‌లో అవిశ్వాస తీర్మానాన్ని అందజేయగా ఇదేనెల 30న స్థానిక మునిసిపాలిటీలో ప్రత్యేక అధికారి ఆర్డీవో కృష్ణవేణి, కమిషనర్ వెంకటస్వామిల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఏ ఒక్క కౌన్సిలర్ హాజరుకాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు అధికారులు ప్రకటించిన విషయం విదితమే. అవిశ్వాసం వీగిపోవడంతో భంగపాటుకు గురైన 13 మంది కౌన్సిలర్లు సర్వాపురంలో జరిపిన సమావేశంలో 13 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు మునిసిపల్ వైస్ చైర్మెన్ మునుగాల వెంకట్‌రెడ్డి ప్రకటించిన విషయం విదితమే. ఈ13 మందిలో శనివారం పైన పేర్కొన్న ఐదుగురు కౌన్సిలర్లు బీజేపీ రారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటించిన నాటి నుంచే రాజీకీయ పర్వం ఆరంభమై బీఆర్ఎస్ పార్టీ రాజకీయాల్లో పెనుమార్పులు చోటు చేసుకొని ఉత్కంఠతకు దారి తీశాయి.

8 మంది కౌన్సిలర్ల రూట్ ఎటో..

బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన 13 మంది కౌన్సిలర్లలో ఐదుగురు బీజేపీలో చేరగా, మిగిలిన 8 మంది ఏ పార్టీలో చేరకుండా ఉంటారా? లేక వీరు కూడా బీజేపీలో చేరుతారా, మనసు మార్చుకొని తిరిగి బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతారా అన్న ప్రచారాలు జోరుగా సాగుతున్నాయి. కౌన్సిలర్లు గత రెండు మూడు రోజులుగా తర్జనభర్జన పడుతున్నారు. వీరిలో ఒకరిద్దరు బీఆర్ఎస్‌లోనే కొనసాగాలని భావిస్తున్నట్లు తెలిసింది. బీఆర్ఎస్ పార్టీకి దూరమైన కౌన్సిలర్లను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేందుకు ఆ పార్టీ నేత అంగీకరించే అవకాశాలు లేవు. బీజేపీ తప్ప ఇతర పార్టీల్లో చేరే అవకాశాలు వారికి లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఈ 8 మంది ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని స్థానికులతోపాటు బీఆర్ఎస్ శ్రేణులు భావిస్తున్నారు. 13 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన తర్వాత ఆ పార్టీ నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇప్పటి వరకు వారి నిర్ణయంపై పెదవి విప్పలేదు.

బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ

నర్సంపేట బీఆర్ఎస్ పార్టీకి కోలుకోలేని దెబ్బతగిలింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి తేరుకోకముందే తాజాగా బీఆర్ఎస్‌కు ఇటీవల రాజీనామా చేసిన యూత్ కన్వీనర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన 13 మంది కౌన్సిలర్లలో 5గురు కౌన్సిలర్లతో సహా 55 మంది తాజాగా శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న బీజేపీలో చేరడం బీఆర్ఎస్ పార్టీకి గట్టిదెబ్బేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆర్టీసీ కారుణ్య నియామకాలకు మోక్షం

అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ● లహరి ఏసీ సెమీ స్లీపర్ బస్సులకు ప్రారంభం


కారుణ్య నియామక పత్రం అందుకుంటూ విలపిస్తున్న స్వప్న

సుబేదారి, ఫిబ్రవరి 3: కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టడం వల్లే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలకు మోక్షం కలిగిందని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. హనుమకొండలో బస్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం 70 మందికి కారుణ్య నియామకాల కింద కండక్టర్ ఉద్యోగాల నియామకపత్రాలు మంత్రి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం వరంగల్ ఉమ్మడి జిల్లాకు ప్రభుత్వం కేటాయించిన నాలుగు లహరీ ఏసీ సెమీ స్లీపర్ బస్సులను మంత్రి కొండా సురేఖ ఎమ్మెల్యేలు, ఆర్టీసీ అధికారులతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సురేఖ మాట్లాడుతూ.. మరికొన్ని రోజుల్లోనే మేడారం జాతర జరగనున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. 6 గ్యారంటీలను వంద శాతం అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వం నియామకాలను నిర్లక్ష్యం చేసిందని, తాము అధికారంలోకి వచ్చిన రెండునెలల్లోనే 7వేల స్టాఫ్‌నర్సు పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చామని తెలిపారు. మరికొన్ని రోజుల్లోనే 15వేల కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, సీపీ అంబర్ కిశోర్ ఝా, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ భాషా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, ఆర్టీసీ వరంగల్ రీజియన్ మేనేజర్ జె.శ్రీలత, డిప్యూటీ ఆర్ఎంలు కే.భానుకిరణ్, మాధవరావుతోపాటు డిపోల మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులను ప్రారంభించిన మంత్రి

వరంగల్-1 డిపోకే కేటాయించిన నాలుగు లహరీ ఏసీ సెమీ స్లీపర్ బస్సులను మంత్రి కొండా సురేఖ స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సులను వరంగల్-1 డిపో నుంచి బెంగళూరుకు నడపనున్నారు. ప్రయాణికులు ఈ బస్సులను వినియగించుకుని సౌకర్యంగా ప్రయాణం చేయాలన్నారు.

10లోగా మేడారం ఏర్పాట్లు పూర్తి

భక్తులకు అందుబాటులోకి సదుపాయాలు : కాంట్రాక్టర్‌లకు రాష్ట్ర మంత్రి సీతక్క సూచన


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మేడారం, ఫిబ్రవరి 3: మేడారం మహాజాతర ఏర్పాట్లను ఈ నెల 10వ తేదీలోగా పూర్తి చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. శనివారం తాడ్వాయి మండలం మేడారంలో పర్యటించిన మంత్రి పనులను పరిశీలించారు. పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ హన్మంతరావు, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి అధికారులతో సమీక్ష జరిపారు. పనుల పురోగతి, నాణ్యతా ప్రమాణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు అందుబాటులోకి వచ్చిన సదుపాయాలు, పూర్తికాని పనులపై చర్చించారు. శాఖల వారీగా జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే జాతరకు వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు అందించడం కోసం ప్రభుత్వం రూ.105 కోట్లను మంజూరు చేసిందని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల కారణంగా జాతర పనులను ఆలస్యంగా చేపట్టడం జరిగిందన్నారు. అయినప్పటికీ జాతరకు పది రోజుల ముందే సౌకర్యాలను వినియోగంలోకి తీసుకువస్తామని మంత్రి సీతక్క చెప్పారు. కొన్ని మట్టి రోడ్డు పనులు మిగిలి ఉన్నాయని, ఊరట్టం-కొండాయి రోడ్డు పనులు అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిపోయాయని తెలిపారు. అటవీశాఖ మంత్రి కొండా సురేఖతో మాట్లాడటం జరిగిందని, రోడ్డు పనులు కొనసాగేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు రాలేదని కొందరు కాంట్రాక్టర్లు జాతర పనులలో మొండికేసే ప్రయత్నం చేశారని, వారిని తప్పించి మరో కాంట్రాక్టర్‌తో పనులు చేయించామని తెలిపారు. పాత బిల్లులతో మేడారం పనులకు ముడిపెడితే ఊరుకునేది లేదన్నారు.

ప్లాస్టిక్ రహితంగా జాతర

ప్లాస్టిక్ రహితంగా జాతర నిర్వహించుకునేందుకు ఇప్పటి నుంచే ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నియంత్రణ నియమాలను పాటించాలని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. విద్యార్థులతో కలిసి ప్లాస్టిక్ నిర్మూలన ర్యాలీలో పాల్గొన్నారు. చీపురుతో గద్దెల ప్రధాన ద్వారం ఎదుట రోడ్లను ఊడ్చారు.

ఓర్వలేకనే ఆరోపణలు

ఎంఎస్ఎంఈ స్కీం కింద రెండు మహిళా సంఘాలకు ఫుడ్ ట్రక్కులను పంపిణీ చేశారు. ఏటూరునాగారం మండలం ఎక్కెల గ్రామంలో సమ్మక్క, సారలమ్మ మహిళా గ్రూపు, గోవిందరావుపేట మండలం పస్రా గ్రామానికి చెందిన రాజరాజేశ్వర మహిళా సంఘానికి ఈ ట్రక్కులను జేడీఎం కొండల్‌రావుతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమం కోరుతుందని, అందులో భాగంగానే ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేసిందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ఓర్చుకోలేక కూలిపోతుందని తప్పుడు మాటలు మాట్లాడుతున్న వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. టీఆర్ఎస్ పేరుతో ప్రజల్లోకి వచ్చిన కేసీఆర్ అధికార అహంకారంతో దేశ రాజకీయాలు చేస్తానని బీఆర్ఎస్‌గా పార్టీ పేరును మార్చడంతో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని విమర్శించారు. ప్రియాంక గాంధీకి తెలంగాణలో తిరిగే అర్హత లేదని కేసీఆర్ బిడ్డ కవిత అనడం సరికాదని అన్నారు. రాష్ట్రంలో ఏ మహిళను తిరగనివ్వకుండా కేసీఆర్ బిడ్డ ఒక్కతే తిరుగుతుందా..! అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందించలేని దుస్థితి కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఏపీవో వసంతరావు, పలు శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మేడారంలో చీపురుతో ఊడుస్తుతున్న మంత్రి సీతక్క

కబ్జాలు, అక్రమాలు, దోపిడీపై బీఆర్ఎస్ దృష్టి

నిధుల వినియోగంలో గత ప్రభుత్వం విఫలం ● తప్పిదాలను సరిదిద్ది నగరాన్ని అభివృద్ధి చేస్తాం.. ● మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 3: వరంగల్ నగరాభివృద్ధికి వివిధ విభాగాల ద్వారా మంజూరైన నిధులను కూడా వినియోగించలేని దుస్థితిలో గత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాలన చేశారని రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ మండిపడ్డారు. శనివారం హనుమకొండలోని 'కుడా' కార్యాలయంలో జీడబ్ల్యూఎంసీ, కుడా పనులను సమీక్షించారు. అనంతరం వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఎస్‌డీఎఫ్, సీడీఎఫ్ తదితర విభాగాల నిధులను నగరాభివృద్ధికి వినియోగించే సోయిలేదని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ రూ.3 కోట్ల తూర్పు నియోజకవర్గ అభివృద్ధి నిధులను ముట్టుకోలేదని దుయ్యబట్టారు. నాటి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఎంత సేపు భూకబ్జాలు, ప్రజలను దోపిడీ చేయడం, భయపెట్టడం, అక్రమాలకు పాల్పడడంతోనే సరిపోయిందని ఆరోపించారు. అంతేకానీ నగరాభివృద్ధిపై చిత్తశుద్ధే కరువైందన్నారు. గత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వరంగల్ నగరాన్ని సమస్యల గుండంగా మార్చారని మంత్రి సురేఖ ధ్వజమెత్తారు. అభివృద్ధి పనుల పేరిట గొప్పలు చెప్పిన బీఆర్ఎస్ నేతలు.. నిధుల కేటాయింపు ఊసే ఎత్తలేదన్నారు. ఇష్టారాజ్యంగా పనులను మంజూరు చేయడం, శంకుస్థాపనలతో ప్రజలను నమ్మించి మళ్లీ అధికారంలోకి వచ్చే కుట్రలకు ఒడిగట్టారన్నారు. కానీ ప్రజలు విశ్వసించకపోవడంతో ఓటమి పాలయ్యారని పేర్కొన్నారు. నాటి మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్ నగరాభివృద్ధి, సమస్యలు, పరిష్కార చర్యలు, నిధుల కేటాయింపు తదితర అంశాలపై సమీక్షలు కూడా జరపని దుస్థితంటూ సురేఖ మండిపడ్డారు.


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

నగరాన్ని అభివృద్ధి చేస్తాం..

గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్ది నగరాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి సురేఖ వెల్లడించారు. ఇష్టారాజ్యంగా ప్రకటించిన పనులను సమీక్షించి వాటి ఆచరణ, నిధులు, ప్రజల అవసరాలు, నగరాభివృద్ధి ప్రాధాన్య క్రమంలో గుర్తించి పనులు చేపడతామన్నారు. వరంగల్‌ను మోడల్ నగరంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. జీడబ్ల్యూఎంసీ, కుడా పనులతో నగర రూపురేఖలను మారుస్తామన్నారు. నగరాన్ని టూరిస్ట్ హబ్‌గా మార్చడం ద్వారా ఆదాయం, ఉద్యోగావకాశాలు నెలకొంటాయన్నారు. అలాగే నగరంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. గత బీఆర్ఎస్ తప్పిదాలు నగరానికి శాపంగా పరిణమించాయన్నారు. మురికివాడలోని ప్రజల సమస్యలు పరిష్కరించే చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. అమరవీరులను గుర్తించి వారికి ఇళ్ల స్థలాలను కేటాయించాలని కలెక్టర్లకు చెప్పినట్లు వివరించారు. వరంగల్‌లో ఇంద్రవెల్లి తరహాలో అమరులను స్మరించే సభను నిర్వహించే ఆలోచనతో ఉన్నట్లు సురేఖ వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. వరంగల్‌లోని బెస్ టెర్మినల్, స్టేడియం ఇతర అభివృద్ధి పనుల శంకుస్థాపన కోసం రేవంత్‌రెడ్డిని వరంగల్‌కు తీసుకురానున్నట్లు మంత్రి సురేఖ చెప్పారు.

విభజన హామీలను విస్మరించిన కేంద్రం

టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్


హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 3: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విభజన సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విస్మరించిందని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్ అన్నారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో శనివారం టీజేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'విభజన హామీలు - కేంద్రప్రభుత్వం వివక్షత - దగాపడ్డ వరంగల్ ' అనే అంశంపై నిర్వహించిన వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయి సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు.

ఓరుగల్లు ఒక చారిత్రాత్మకమై పోరుగల్లు అని, చాకలి ఐలమ్మ పోరాట వారసత్వం, బందగీ, కాళోజీ, ఆచార్య జయశంకర్ వరకు కొనసాగిన పోరాట ఘనత ఈ ప్రాంతానిదని అన్నారు. తెలంగాణ ప్రాంతం సుదీర్ఘకాలంగా పాలకుల అణచివేతకు గురైందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది త్యాగాలను తన పొత్తిళ్లల్లో నింపుకొని ఎంతో మంది త్యాగనిరతితో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని కోదండరామ్ అన్నారు. వేలాది మంది పోరాటంతో సాధించుకున్న తెలంగాణను దొరల గడీలకు పరిమితమైతే ఇటీవల జరిగిన ఎన్నికల్లో దొరల గడీల పాలనను ఓటు అనే వజ్రాయుధం ద్వారా పాలకుల గడీలను బద్ధలు కొట్టి ప్రజాస్వామ్య పాలనను ప్రజలు కోరుకున్నారని అన్నారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ తక్షణమే ఏర్పాటు చేయాలని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని వెంటనే ఏర్పాటు చేయాలని, ఉద్యోగుల విభజనను పూర్తి చేసి తెలంగాణ ఉద్యోగులను వెనక్కు పంపాలని, పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర స్థాయి సంస్థలు, ఆస్తులను విభజించాలని, కృష్ణా జలాల్లో తెలంగాణ న్యాయమైన వాటా తేల్చాలని, రాష్ట్రంలో హార్టికల్చర్ యూనివర్సిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని సదస్సులో ఏకగ్రీవంగా తీర్మానించారు.

టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు చిల్లా రాజేంద్రప్రసాద్ అధ్యక్షత నిర్వహించిన సదస్సులో ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, తెలంగాణ జనసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మరాజన్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జాతీయ నాయకులు మన్నె బాబురావు, ప్రజాసంఘాల నాయకులు రత్నం కిరణ్, చాప బాబుదొర, జహంగీర్, డోలి సత్యనారాయణ, బొనగాని రవీందర్, గుండు రాంచందర్, వెలిశాల రాజేష్, మనోజ్‌కుమార్, బండి మొగిలి, దుర్గం సారయ్య, అంకేశ్వరపు రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన గ్రంథాలయాలను పునరుద్ధరించాలి

కాళోజీ జంక్షన్, ఫిబ్రవరి 3: పుస్తకాలు మెదడుకు పదును పెడుతాయన్న మేధావుల నినాదాలకు సార్థకత కల్పించకుండా ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పౌరస్పందన వేదిక జిల్లా అధ్యక్షుడు కరేటి శంకర్‌రావు యాదవ్, ప్రధాన కార్యదర్శి నల్లెల్ల రాజయ్య ఆవేదన వ్యక్తం చేశారు. హనుమకొండ కాళోజీ సెంటర్‌లోని ప్రజాకవి కాళోజీ నారాయణరావు విగ్రహం ఎదుట శనివారం వారు నిరసన ప్రదర్శన చేపట్టారు. వరంగల్ నగర పరిసర ప్రాంత మండలాల్లోని గ్రంథాలయాలు రెండేళ్లుగా మూతపడి శిథిలావస్థకు చేరి నిర్వహణ అధ్వాన్నంగా మారిన అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమని అన్నారు.


కాళోజీ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న పౌర స్పందన వేదిక నాయకులు

ఈ సందర్భంగా పౌరస్పందన వేదిక హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కరేటి శంకర్‌రావు మాట్లాడుతూ.. ప్రజా కవులుగా పేరొందిన కాళోజీ సోదరుల జన్మస్థలమైన మడికొండ గ్రామంలో 30 ఏళ్ల కిందట ఏర్పడిన గ్రంథాలయం రెండేళ్లుగా మూతపడి గోడలు కూలిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. గీసుగొండ మండల కేంద్ర గ్రంథాలయం, వరంగల్‌లోని రామన్నపేట గ్రంథాలయం, హనుమకొండలోని జిల్లా గ్రంథాలయ సంస్థలకు నిర్వహణ కొరవడిందని అన్నారు. ఇప్పటికైనా జిల్లా గ్రంథాలయ సంస్థ మేలుకొని శిథిలావస్థకు చేరిన గ్రంథాలయాలన్నింటిని పునరుద్ధరించి గ్రామాల్లోని విద్యార్థులు పోటీ పరీక్షల మేథో వికాసానికి తోడ్పాటు నందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ముగిసిన దరఖాస్తుల ఘట్టం

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 3: రానున్న పార్లమెంట్ ఎన్నికల క్రమంలో ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ఘట్టం ముగిసింది. నాలుగు రోజులుగా హైదరాబాద్ గాంధీభవన్‌లో దరఖాస్తుల స్వీకరణ క్రమంలో వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ టికెట్ ఆశావహులు దరఖాస్తులను సమర్పించారు. శనివారం చివరి రోజు కావడంతో ఈ రెండు స్థానాల నుంచి ఆశావహులు డబుల్ డిజిట్‌లో ఉండడంతో దరఖాస్తుల పరంపర కొనసాగింది. ఇప్పటిపే వరంగల్ ఎంపీ టికెట్ కోసం కాంగ్రెస్‌లోని సీనియర్ నాయకులతో పాటు ప్రభుత్వ అధికారులు కూడా రాజకీయ ఆరంగ్రేటం కోసం దరఖాస్తు చేసుకున్నారు.


వరంగల్ పార్లమెంట్ స్థానం కోసం దరఖాస్తు అందచేస్తున్న పిడమర్తి రవి

ఢిల్లీకి ఫైనల్ లిస్ట్

దరఖాస్తుల ముగింపుతో ఈనెల 8లోగానే స్ర్కీనింగ్ పూర్తి చేసి ముగ్గురేసి అభ్యర్థులతో కూడిన జాబితాను టీపీసీసీ ఢిల్లీకి పంపనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. అనంతరం అధిష్ఠానం ఎంపిక ప్రకియను చేపట్టి 15 నుంచి 18వ తేదీలోగానే అభ్యర్థుల ఎంపిక పూర్తి ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

ఇనుగుర్తి, ఫిబ్రవరి 3 : పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. కోమటిపల్లి, ఇనుగుర్తిలో శనివారం పర్యటించారు. కోమటిపల్లిలో లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తొలిసారిగా గ్రామానికి రావడంతో ఆలయ అర్చకుడు శ్రీనివాసచార్యులు, వాగ్వీజయభట్టార్‌లు ప్రత్యేకపూజలు నిర్వహించి, ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో భాగంగా ఇప్పటికే రెండు పథకాలను అమలు చేసామని చెప్పారు. త్వరలోనే మిగతా పథకాలను కూడా అమలు చేస్తామని, ప్రజల నుంచి ఆరు గ్యారెంటీ పథకాలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించామన్నారు. మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలో ప్రతీ గ్రామంలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రజావేదిక కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈనెల 6న కోమటిపల్లి, చిన్ననాగారం గ్రామాల్లో ప్రజావేదిక కార్యక్రమాన్ని అధికారులతో కలిసి నిర్వహిస్తామని, ప్రతీ గ్రామంలో పేరుకుపోయిన సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా కృషి చేస్తామని అన్నారు. తాము పాలకులము కాదు... ప్రజాసేవకులమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, పీసీసీ సభ్యులు దస్రునాయక్, పోలెపాక నాగరాజు, బండారు వెంకన్న, రావుల మల్లేశం పాల్గొన్నారు.

22 జీపీల్లో రూ.3.66 లక్షల దుర్వినియోగం

● డీఆర్‌డీవో అడిషనల్ పీడీ శాంతకుమారి

నర్సింహులపేట, ఫిబ్రవరి 3 : మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.3.65 లక్షలు దుర్వినియోగమైనట్లు డీఆర్‌డీవో అడిషనల్ పీడీ శాంతకుమారి మండల ప్రజాపరిషత్ కార్యాయలంలో వెల్లడించారు. 2021 సంవత్సరం అక్టోబర్ 1వ తేదీ నుంచి 2023 మార్చి 1 వరకు 871 పనులకు గాను రూ.7.84 కోట్లు ఖర్చుపై 14వ సామాజిక తనిఖీ అధికారుల నివేదిక మండల ప్రజావేదికలో శనివారం రెండోరోజు వెల్లడించిన వివరాల ప్రకారం గ్రామాలవారీగా నిధుల దుర్వినియోగం వివరాలు ఇలా ఉన్నాయి. జయపురంలో రూ.51,230, బక్కతండాలో రూ.16,588, బానుతండాలో రూ.7,651, కొమ్ములవంచలో రూ.4,654, రూప్లాతండాలో రూ.8,879, కౌసల్యదేవిపల్లిలో రూ.2,121, పెద్దనాగారం స్టేజీలో రూ.4,



ప్రజా వేదికలో వివరాలు వెల్లడిస్తున్న ఆడిట్ డీఆర్‌పీ మానస

076, జగ్గుతండాలో రూ.9,139, గోపతండాలో రూ.6,065, లోక్యతండాలో రూ.7,467, వస్రాంతండాలో రూ.47,570, నర్సింహాపురం బంజరలో రూ. 1,709, బోడ్కాతండాలో రూ.39,938, అజ్మీర తండాల్లో రూ.9,695, బొజ్జన్నపేటలో రూ.16,817, ముంగిమడుగులో రూ.14,162 దుర్వినియోగమయ్యాయి.

నర్సింహులపేటలో రూ.22,741, పడమటిగూడెంలో రూ.15,95, పకీరతండలో రూ.20,837, పెద్దనాగారంలో రూ. 1,800, రామన్నగూడెంలో రూ.4,282, వంతడుపలలో రూ.9,258 చొప్పున నిధులు దుర్వినియోగమయ్యాయి. వీటిల్లో ఎంపీడీవో రూ.11,966, పంచాయతీ కార్యదర్శులు రూ.1,19,519, ఏపీవో రూ.9732, ఈసీ రూ.35,495, టెక్నికల్ అసిస్టెంట్లు రూ.79,101, కంప్యూటర్ ఆపరేటర్లు రూ.16,567, ఫీల్డ్ అసిస్టెంట్లు రూ.2818, జీపీలకు రూ.89,435, చొప్పున దుర్వినియోగానికి పాల్పడినట్లు డీఆర్‌డీవో అడిషనల్ శాంతకుమారి తెలిపారు. నివేదికను డ్వామా ఉన్నతాధికారులకు అందజేసి బాధ్యులపై తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా విజిలెన్స్ అధికారి యాకూబ్, అంబుడ్స్‌మాన్ ఆదాము, ఎంపీపీ టేకుల సుశీల, ఎంపీడీవో భారతి, ఎంపీవో సోంలాల్, ఏపీవో భూపాల్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ నర్సయ్య, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

● ఏఎంవో ఆజాద్ చంద్రశేఖర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 3 : మార్చిలో జరగబోయే పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపే విధంగా శ్రద్ధ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ (ఏఎంవో) ఆజాద్‌చంద్రశేఖర్ అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలోకేజీబీవీ, మోడల్‌స్కూల్, జడ్పీ, ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు శనివారం జిల్లా సోషల్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ గాంధీజ్ఞాన్ ప్రతిష్ఠ హైదరాబాద్ సౌజన్యంతో జిల్లాస్థాయి సాంఘికశాస్త్ర టాలెంట్‌టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏఎంవో మాట్లాడుతూ సాంఘిక శాస్త్రం సబ్జెక్టులో పది ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు 10/10 జీపీఏ సాధించే విధంగా విద్యార్థులను సంసిద్ధులని చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ పోటీల్లో ఇంగ్లీష్, తెలుగు మీడియంలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలను అందజేశారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు స్వరూపరాణి, కార్యదర్శి ఉమాదేవి, బాధ్యులు ఎండీ అలీ, వెంకన్న, లక్ష్మారెడ్డి, కిషన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైలు కిందపడి రైల్వే ఉద్యోగి ఆత్మహత్య



పాండు (ఫైల్)

కేసముద్రం, ఫిబ్రవరి 3 : కేసముద్రం స్టేషన్ జమలాపురానికి చెందిన రైల్వేఉద్యోగి బరిగెల పాండు (42) (రైల్వే పాండు) రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి శనివారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నట్లు వరంగల్ జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ పి.రాజు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ కథనం ప్రకారం రైల్వేలో పెట్రోల్ మెన్‌గా పనిచేస్తున్న పాండు తన వ్యక్తిగత సమస్యలు, ఇతర కారణాలవల్ల ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మృతునికి భార్య సౌజన్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుం బసభ్యులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

పెనుగొండ హైస్కూల్లో నమూనా జడ్పీ సమావేశం

● మేడారం జాతరలో పర్యావరణ స్పృహ కోసం సభ

● జిల్లాలో తొలిసారి నమూనా సమావేశం



నమూనా జడ్పీ సమావేశాన్ని నిర్వహిస్తున్న విద్యార్థులు

కేసముద్రం, ఫిబ్రవరి 3 : మేడారం జాతరకు వచ్చే ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ స్పృహను పెంచుతూ జాతర జరుపుకునేలా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి-పర్యావరణ విద్యావి భాగం, విద్యాశాఖ సహా యంతో పెనుగొండ జడ్పీ హైస్కూల్లో శనివారం నమూనా జడ్పీ సమావేశాన్ని విద్యార్థులు నిర్వ హించారు. జడ్పీ చైర్మన్‌గా ఎస్‌కె.షాజ్మీన్, వైస్ చైర్మన్‌గా ఎస్‌కె.ఆసియా, ఎంపీగా టి.రాశి, ఎమ్మెల్యేగా ఎం.రాంచరణ్, జడ్పీ సీఈవోగా ఎస్.వైష్ణవి, కలెక్టర్‌గా ఎస్‌కె.నస్రిన్, పాలక, ప్రతిపక్షాల జడ్పీటీసీలుగా, విలేకరులుగా విద్యార్థులు వ్యవహరించారు. జాతరలోని పర్యావరణ అంశాలపై చర్చ నిర్వహించారు. ఎన్‌జీసీ కోఆర్డినేటర్ వి.గురునాథరావు మాట్లాడుతూ జిల్లాలో మొదటిసారి మోడల్ జడ్పీ సమావేశాన్ని నిర్వహించామని తెలిపారు. హెచ్ఎం కె.యాదగిరి, సాంఘిక, సామాన్యశాస్త్ర ఉపాధ్యాయులు భాస్కర్, హుస్సేన్ పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 3 : మునిసిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. శనివారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. చిన్నారులు ఉపాధ్యాయుల వలే దుస్తులు ధరించి పాఠశాల నిర్వహించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ఎంఈవోగా రోహిత్, హెచ్ఎంగా వెంకటవర్షిత్, ఉపాధ్యాయు లుగా శ్రీప్రియ, తనుశ్రీ, స్వప్నలాస్య, టెర్లినా, అసిఫా, అక్షయ, నిత్యశ్రీ, ఏసుమనిత, మమత, రవళి, జ్ఞానేశ్వరి, పల్లవి, చరణ్, శివ, చందు వ్యవహరించారు. హెచ్ఎం గుగులోతు కిషన్‌నాయక్, ఉపాధ్యాయులు రోజారాణి, మహేశ్వరి, ప్రభావతి దేవి, సరిత, మంజుల పాల్గొన్నారు.

'ఏకలవ్య' గురుకుల పాఠశాల స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో

గూడూరు, ఫిబ్రవరి 3 : చంద్రుగూడెంలో ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని మహబూబాబాద్ ఆర్డీవో అలివేలు శనివారం పరిశీలించారు. ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల భవన సముదాయం కోసం 8.20 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఆ భూమిలో గ్లోబల్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ నిర్మాణ పనుల టెండర్ దక్కించుకుంది. రూ.35 కోట్లతో పనులు నిర్వహణకు సిద్ధమవుతుండగా సంబంధిత భూమి రైతులు పనులను అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్డీవో అలివేలు, గూడూరు తహసీల్దార్ అశోక్‌కుమార్‌తో పనులు జరిగే ప్రదేశానికి చేరుకుని భూమిని పరిశీలించారు. అక్కడికి ఆర్డీవో వచ్చారని తెలుసుకున్న గిరిజన రైతులు భూముల వద్దకు చేరుకుని ఆర్డీవో మాట్లాడారు. తమ భూములను లాక్కోవద్దని, ఇవే మాకు జీవనాధారమని ఆవేదన వ్యక్తం చేశారు. భూమికి బదులుగా మరోచోట భూమిని ఇస్తే పంటలు సాగు చేసుకుంటు కుటుంబాలను పోషించుకుంటామని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై కలెక్టర్ వద్ద నివేదిస్తానని స్పష్టం చేశారు. వారివెంట ఎస్సై-2 ప్రవళిక, నయాబ్‌తహసీల్దార్ కోమల, ఆర్ఐ మల్లయ్య, నిర్మాణ సంస్థ జనరల్ మేనేజర్ సాల్మన్‌రాజ్, గురుకుల ప్రిన్సిపాల్, సిబ్బంది ఉన్నారు.

చిల్డ్రన్స్ హోంలో మునిసిపల్ చైర్మన్ జన్మదిన వేడుకలు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 3 : జిల్లా కేంద్రంలోని ఆశా చిల్డ్రన్స్‌హోంలో శనివారం స్థానిక మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. చిల్డ్రన్స్‌హోంలో చిన్నారుల మధ్య జన్మదిన కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం పిల్లలకు స్వీట్లు అందించారు. చిన్నారులు పాఠశాలలకు వెళ్లేందుకు చైర్మన్ రాంమోహన్‌రెడ్డి-సౌజన్య దంపతులు వ్యాను కొనుగోలు కోసం విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. మాజీ సర్పంచ్ డాక్టర్ సుధాఅర్జున్‌రెడ్డి, ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ పీవీ ప్రసాద్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు



జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న రాంమోహన్‌రెడ్డి

మాధవపెద్ది వెంకట్‌రెడ్డి, అనుమాల వెంకటేశ్వర్లు, వి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మునిసిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నేతలు, మునిసిపల్ అధికారులు రాంమోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

రేపు ఉద్యోగ నియామకాలకు ఎంపిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 3 : విదేశాల్లో ఉద్యోగ నియామకాలకు ఈ నెల 5న హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో అర్హులైన అభ్యర్థులు హాజరుకావాలని జిల్లా ఉపాధి అధికారి రామకృష్ణ శనివారం తెలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లామా లేదా డిగ్రీ హోటల్ పరిశ్రమలో ఫుడ్, బేవరేజెస్ సర్వీస్ చేసిన అనుభం, పాస్‌పోర్ట్ ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. తెలంగాణ ప్రభుత్వ రంగసంస్థ తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ హైదరాబాద్ ద్వారా జపాన్‌లో నెలకు రూ.లక్ష నుంచి రూ. 1.5 లక్షల వరకు వేతనం ప్యాకేజీ ఉంటుందని తెలిపారు. 22 నుంచి 27ఏళ్ల వయస్సు ఉన్న అభ్యర్థులు సోమవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాల న్నారు. ఇతర వివరాలకు సెల్‌నెంబర్ : 8125251408ను సంప్రదించాలన్నారు.

రోడ్డుపై గుంతలను పూడ్చిన పోలీసులు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 3 : జిల్లా కేంద్రంలోని మదర్‌థెరిస్సా సెంటర్‌లో గుంతలమయమైన రోడ్డును శనివారం ట్రాఫిక్ పోలీసులు పూడ్చివేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు ఎల్లయ్య జంపయ్య సతీష్ మాట్లాడారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉన్న మదర్‌థెరిస్సా సెంటర్‌లో గుంతలమయమైన రోడ్లతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వాహనరాకపోకల ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు మొరంతో గుంతలమయమైన రోడ్డును పూడ్చివేసినట్లు చెప్పారు. దీంతో ప్రయాణికులు ట్రాఫిక్ పోలీసులను అభినందించారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

నెల్లికుదురు, ఫిబ్రవరి 3 : మండలానికి చెందిన విద్యార్థి (16) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఓ విద్యార్థి అసభ్యకరమైన మెస్సేజ్‌లు ఆమెపై పెట్టడంతో అవి సామాజిక మాధ్యమాల ద్వారా వైరల్ అయ్యాయి. దీంతో ఆ విద్యార్థిని మనస్తాపం చెంది గతనెల 28న పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబసభ్యులు హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఈనెల 2న నెల్లికుదురు పోలీస్‌లు మెసేజ్‌లు పెట్టిన విద్యార్థిపై పోక్సోకేసు నమోదు చేశారు. శనివారం పరిస్థితి విషమించి, చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి చెందింది. బాలికతండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, శవానికి పోస్టుమార్టం నిర్వహించారు. కాగా, విద్యార్థిని మృతి చెందడంపై రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సుమోటా కేసుగా స్వీకరించినట్లు మెంబర్ బృందాధరావు తెలిపారు. ఈ కేసు విచారణ సజావుగా జరిగే విధంగా కృషి చేస్తామని బాధిత కటుంబానికి హామీ ఇచ్చినట్లు సమాచారం.

బీఎస్పీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా కిరణ్

డోర్నకల్, ఫిబ్రవరి 3 : బీఎస్పీ పార్టీ డోర్నకల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా డోర్నకల్ మండలం తోడేళ్లగూడెంకుచెందిన బండెల కిరణ్‌కుమార్‌ను నియమించినట్లు ఆ పార్టీ డోర్నకల్ అసెంబ్లీ అధ్యక్షుడు బాష్పంగు మహేందర్ శనివారం తెలిపారు. తనపై నమ్మకంతో ప్రధాన కార్యదర్శి పదవిలో నియమించిన బాష్పంగు మహేందర్‌కు, జిల్లా ఇన్‌చార్జి విజయ్‌కాంత్‌కు కిరణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో బీఎస్పీ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

'ఉన్నత శిఖరాలను అధిరోహించాలి'

కురవి, ఫిబ్రవరి 3 : విద్యార్థులు పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డీడీ ఎర్రయ్య అన్నారు. ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థిని నందినిని శనివారం కురవి ఆశ్రమ పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎర్రయ్య మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని, విద్యార్థిని నందినిని తోటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీడీవో సత్యవతి, హెచ్‌డబ్ల్యూవో బి.పద్మ, హెచ్ఎం డీసీఎస్ శర్మ, సీహెచ్.రవి పాల్గొన్నారు.

రగ్బీ పోటీకి దాట్ల విద్యార్థిని ఎంపిక

దంతాలపల్లి, ఫిబ్రవరి 3 : మండలంలోని దాట్ల ఉన్నత పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థిని పస్తం క్రీస్తుకళ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కంచెర్ల ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 4, 5న యాదాద్రి జిల్లాలోని బోనగిరిలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ రగ్బీ క్రీడల్లో పాల్గొననుందన్నారు. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించి అభినందించింది. ఉపాధ్యాయులు సంజయ్ కుమార్, సరిత, ప్రేమ్‌కుమార్, విజయ్, రమేష్, స్వప్న, రిషిత, మాదవి, మంజుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

● నర్సింహులపేట :పెద్దనాగారం ప్రభుత్వ హైస్కూల్‌లో తొమ్మిదవ తరగతి విద్యాభ్యాసం చేస్తున్న సీహెచ్.ఉమేష్ రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు గైడ్ టీచర్ ఇ.మల్లయ్య శనివారం తెలిపారు. రాష్ట్రస్థాయి రగ్బీ అసోసియేషన్ సబ్ జూనియర్ క్రీడా విభాగంలో ఈనెల 3, 4 తేదీల్లో యాదాద్రి భువనగిరిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం జానకీ సుమన, ఉపాధ్యాయ బృందం ఉమేష్‌ను అభినందించారు.

శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలి

దంతాలపల్లి, ఫిబ్రవరి 3 : యాసంగి సాగులో రైతులు తప్పక శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటిస్తే అధిక దిగుబడి సాధిస్తారని ఏఈవో సందీప్ అన్నారు. శనివారం ఆయన రామానుజపురంలో వరిక్షేత్రాన్ని పరిశీలించారు. జింక్‌లోపం, మొగిపురుగు దాడి, దోమకాటు, తదితర క్రిమికాటల వినాశానికి పలు సూచనలు చేసి పెస్టిసైడ్స్‌ను పిచికారి చేయాలన్నారు. రైతులు అప్రమత్తంగా వ్యవహరించి సకాలంలో అధికారుల సూచనలు పాటించాలన్నారు.

రైతులకు 9ఎల్ ద్వారా సాగునీటిని అందిస్తాం

దంతాలపల్లి, ఫిబ్రవరి3 : యాసంగిలో రైతాంగానికి 9ఎల్ ఉపకాలువ ద్వారా రైతాంగానికి సాగునీటిని అందిస్తామని డీఈ వినయ్ అన్నారు. శనివారం ఆయన ఎలుకల గుట్ట సమీపంలో ఇటీవల తెగిన 9ఎల్ ఉప కెనాల్ మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. మెయిన్ కెనాల్‌తో పాటు 7ఎల్, 9ఎల్, 8ఎల్‌తోపాటు ఏ ఉప కెనాల్‌కు గండ్లు పెట్టవదన్నారు. గండ్లు పెడితే క్రిమినల్ కేసులను పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ మౌనిక, వర్క్ఇన్‌స్పెక్టర్ దేవేందర్ పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఆశావహులు

మహబూబాబాద్ టౌన్, జనవరి 3 : మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ కోసం ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ వైస్ చైర్మన్, తేజావత్ బెల్లయ్యనాయక్, రిటైర్డ్ పోలీస్ అధికారి ఎం.సాంబయ్య శనివారం గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. బెల్లయ్యనాయక్ కాంగ్రెస్ పార్టీలో గత 12 ఏళ్ల క్రియాశీలకంగా పని చేస్తూ పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ దేశ వ్యాప్తంగా చేపట్టిన భారత్‌జోడో యాత్రలో పాల్గొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మానుకోట అసెంబ్లీ టిక్కెట్‌ను ఆశించారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మానుకోట ఎంపీగా తనకు అవకాశం కల్పించాలని బెల్లయ్యనాయక్ దరఖాస్తు చేసుకున్నారు.



ఎంపీ టిక్కెట్ కోసం దరఖాస్తు చేసుకుంటున్న బెల్లయ్యనాయక్

హన్మకొండ మండలం గుండ్ల సింగారానికి చెందిన సాంబయ్య పోలీస్‌శాఖలో సీఐ స్థాయి అధికారిగా పనిచేసి, పదవీవిరమణ పొందారు. మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం కోసం కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్‌ను ఆశిస్తూ గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల



ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరుతున్న రిటైర్డ్ పోలీస్ అధికారి ఎం.సాంబయ్య

ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీని కలిసి తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, సాంబయ్య ఉద్యోగ సమయంలో మహబూబాబాద్‌లో సీఐగా పని చేసిన కాలంలో ఈ ప్రాంతంలో అనేక సామాజిక సేవ కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించారు.



విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న ఝాన్సీరెడ్డి

సామాజిక సేవచేయడం అభినందనీయం

తొర్రూరు, ఫిబ్రవరి3 : పాలకుర్తి ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా సామాజిక సేవాకార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శనివారం పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా తొర్రూరులోని విశ్రాంతి భవనంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మహాన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మొదట క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి అనాథ మైనార్టీ పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 115 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, సామగ్రి పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బిజ్జాల వరప్రసాద్, చిన్నాల కిషన్‌యాదవ్, తూనం శ్రావణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజలకు సేవ చేసేందుకే తాము ఇక్కడికి వచ్చామన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కె.నిరంజన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, హామ్యానాయక్, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, హనుమాండ్ల నరేందర్‌రెడ్డి, పెదగాని సోమయ్య, బిజ్జాల వరప్రసాద్, చిన్నాల కిషన్ యాదవ్, తూనం శ్రావణ్, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, మేకల కుమార్, విజయ్‌పాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పెద్దవంగర : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్‌కట్ చేసి, పండ్లను పంపిణీ చేసి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ పీసీసీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, నాయకులు దుంపల శ్యామ్, రంగు మురళి, ముత్యాల పూర్ణచందర్, వేముల వెంకన్న, సీతారామ్, చంద్రశేఖర్, వెంకన్న, సతీష్, దాసరి శ్రీనివాస్, సంపత్, బీసు హరికృష్ణ, పవన్, మల్లేష్, రామ్‌చరణ్ పాల్గొన్నారు.

విద్య, వైజ్ఞానిక మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

దంతాలపల్లి, ఫిబ్రవరి 3 : ఖమ్మం జిల్లా కేంద్రంలో ఈనెల 11, 12న జరిగే రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక మహాసభల పోస్టర్‌ను శనివారం దంతాలపల్లిలోని ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింత విష్ణువర్ధన్‌రెడ్డి, స్థానిక హెచ్ఎం వేణుమాధవ్‌రెడ్డి మాట్లాడారు. టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు తాళ్లూరి రవీందర్, ప్రధాన కార్యదర్శి ఎనమాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు సురేందర్‌గుప్తా, కుమారస్వామి, యాకయ్య, పద్మవతి, కవిత, మంజుల, రమేష్, ప్రవీణ్‌రెడ్డి, హారిక పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

● పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ ఆనంద్‌కుమార్

పెద్దవంగర, ఫిబ్రవరి 3 : అసమర్థుల పాలనలో రాష్ట్ర ఆగమైందని, కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ ఆనంద్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పాస్టర్ ఈవి థామస్ అధ్యక్షతన పాస్టర్ ఫెలోషిప్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. క్రైస్తవుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తూ అభివృద్ధి నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ, బీజేపీలు క్రైస్తవులకు చేసిందేమీ లేదని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీ, క్రైస్తవ సమాజం కోసం ఎన్నో సేవలు చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ ఆనంద్ కుమార్‌కు వరంగల్ ఎంపీ టికెట్ కేటాయించాలని పలువురు క్రైస్తవులు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మార్టిన్, లుతాన్, ప్రతాప్, జామువా, సుధాకర్, వెంకటరత్నం, ఆనందం పాల్గొన్నారు.

సీఎం సలహాదారుడిని కలిసిన బొప్పా నాయకులు

తొర్రూరు, ఫిబ్రవరి 3: ఇటీవల నియమింపబడిన సీఎం సలహాదారుడు హర్కర వేణుగోపాల్‌రావును రాష్ట్ర బ్రాహ్మణ సంఘం కార్యదర్శి తొర్రూరు వాసి వింజమూరి సుధాకర్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. పలు సమస్యలు, అంశాలపై ఆయనతో చర్చించారు. బ్రాహ్మణ పరిషత్‌కు నూతన చైర్మన్‌ను వెంటనే నియమించాలని, బ్రాహ్మణులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు. నిమ్స్ అడిషనల్ డైరెక్టర్ సీతారామయ్య బొప్పా అధ్యక్షుడు సునిల్‌కుమార్, నీలకంఠం ఉన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

తొర్రూరు, ఫిబ్రవరి 3 : తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒక్కరోజు డీఈవోగా, ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలస్థాయి నుంచి మంచి లక్ష్యాలను ఏర్పరచుకుని కష్టపడి చదవాలని సూచించారు. విద్యార్థులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు బ్రహ్మానందరెడ్డి, చంద్రమౌళి, యాకస్వామి, శ్రీనివాస్, లింగమూర్తి, రేణుక, జ్యోతి, ఐలయ్య ఉన్నారు.

రెండు గేదెల వేలం

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 3 : దారితప్పి వచ్చిన రెండు గేదెలను ఈ నెల 7న వేలం వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి దేవయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతనెల రోజుల క్రితం దారితప్పి తొర్రూరు మండలం హరిపిరాల గ్రామానికి వచ్చిన ఓ గేదె, దూడ చుటుపక్కల రైతుల పంటలను ధ్వంసం చేస్తుండగా, గ్రామ ప్రజలు జీపీకి అందజేశారు. ఈ మేరకు పలు గ్రామాల అధికారులు, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇచ్చినప్పటికీ ఎవ్వరు రాకపోవడంతో ఈనెల 7న వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గేదెలకు సంబంధించిన వారు ఉంటే వేలానికి ముందు రోజు సంబంధిత ప్రతాలతో రావాల్సిందిగా కోరారు.

అయోధ్యకు ప్రత్యేక రైలు



మాట్లాడుతున్న శ్రీమాన్

తొర్రూరు, ఫిబ్రవరి 3 : ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో నూతనంగా నిర్మించిన శ్రీబాలరామ ఆలయ దర్శనం కోసం వెళ్లేందుకు ప్రత్యేక రైలును ఏర్పాటు చేసినట్లు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్ తెలిపారు. శనివారం డివిజన్ కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదిన కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి ప్రత్యేక రైలులో నియోజకవర్గం నుంచి సుమారు 250 మంది బీజేపీ కార్యకర్తలు, రామభక్తులను ఉచితంగా అయోధ్యకు తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. నాయకులు రంగు రాములు, పల్లె కుమార్, సురేష్, రాజేష్, నవీన్, సంతోష్, గణేష్, సుమన్ పాల్గొన్నారు.

పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య

ఐనవోలు, ఫిబ్రవరి 3: అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తిచెంది పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఐనవోలులో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం. మహబుబాబాద్ జిల్లా గంగారం మండలం పెద్ద ఎల్లాపూరం గ్రామానికి చెందిన తాళ్లపల్లి కిరణ్ (31) అత్తగారి ఊరైన ఐనవోలు మండలం పున్నేలులో ఉంటూ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబం, వ్యక్తిగత అవసరాలకు అప్పులు చేశాడు. ఆర్థిక ఇబ్బందులతో అప్పులు తీర్చే మార్గం కనిపించక ఆందోళనకు గురయ్యాడు. జీవితంపై విరక్తి చెందిన ఆయన గతనెల 31న పంథిని శివారులో పురుగుల మందు తాగగా చికిత్సకోసం వరంగల్‌కు తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య అశ్విని, కుమారుడు కూతురు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రామీణ భారత్ బంద్‌ను సక్సెస్ చేయాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 3 : సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడ సత్యనారాయణ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ సీపీఐ (ఎంఎల్) పార్టీలో జాతీయ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ, సంయుక్త కిసాన్ మోర్చా జాయింట్ పిలుపు మేరకు సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జి.నర్సు, నందగిరి వెంకటేశ్వర్లు, గునిగంటి రాజన్న, ఉమగాని సత్యం, మేక వీరన్న, గుజ్జు దేవేందర్, నల్లు సుధాకర్, చింతకుంట్ల వెంకన్న, ముంజంపల్లి వీరన్న, తాజ్‌పాష పాల్గొన్నారు.

● గార్ల : సంఘటిత, అసంఘటిత కార్మికులకు కనీసవేతన చట్టం అమలు చేయాలని కోరుతూ జరిగే దేశవ్యాప్త సమ్మెను కార్మికలోకం విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పిరెడ్డి, జడ శ్రీనివాస్, రమాదేవి, మౌలానా, అంబటి వీరస్వామి పాల్గొన్నారు.

జీపీలకు స్పెషల్ ఆఫీసర్లు వీరే..

దంతాలపల్లి, ఫిబ్రవరి 3 : మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు శనివారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి స్పెషల్ అధికారులను కేటాయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలకేంద్రంతో పాటు బొడ్లాడకు తహసీల్దార్ టి.శ్రీనివాస్‌రావు, దాట్ల గ్రామాధికారిగా స్థానిక హెచ్.ఎం.కృష్ణయ్య, వేములపల్లి, రామానుజపురం, దొనకొండకు ఎస్సారెస్పీ ఏఈఈ మౌనిక, ఆగపేట, రామవరం, తూర్పుతండాకు ఎస్సారెస్పీ డీఈఈ వినయ్, నిదానపురం, కుమ్మరికుంట్లకు ఎంపీడీవో విజయలక్ష్మి, లక్ష్మీపురం, రేపోణికి ఎంపీవో అప్సరపాషా, వాల్యాతండా, బీరిశెట్టిగూడెంకు పశువైద్యాధికారి వినోద్, గున్నేపల్లికి నాయబ్‌సాబ్ శ్రీలత, పెద్దముప్పారానికి స్థానిక హెచ్ఎం శ్రీదేవి లను నియమించారన్నారు. వీరు గ్రామాల్లో జరిగే పలు అభివృద్ధి పథకాల్లో కీలక పాత్రను పోషించనున్నారన్నారు.

కోమటిపల్లి పాఠశాలలో వైద్యశిబిరం

ఇనుగుర్తి, ఫిబ్రవరి 3 : మండలంలోని కోమటిపల్లి పాఠశాలలో శనివారం వైద్యం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు శివరాం మాట్లాడుతూ ఎనిమియా ముక్తి భారత్ కార్యక్రమంలో 8, 9, 10 తరగతి విద్యార్థుల్లో రక్తహీనత లోపాన్ని గుర్తించేందుకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, సునీల్, విజయ పాల్గొన్నారు.

'టీపీటీఎఫ్ మహాసభలను సక్సెస్ చేయండి'



వేమునూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 3 : ఖమ్మంలో ఈనెల 11, 12 తేదీల్లో జరగనున్న తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ యూనియన్ (టీపీటీఎఫ్) ద్వితీయ విద్యావైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి చీకటి ఉపేందర్ పిలుపునిచ్చారు. మానుకోట మండలం వేమునూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ద్వితీయ మహాసభ పోస్టర్లను ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయిస్తూ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతనజాతీయ విద్యావిద్యావిధానం- 2020లో విద్యలో ప్రైవేటీ కరణను బలోపేతం చేసేందుకు కుట్రలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల కామన్ సర్వీస్ రూల్స్, పండిట్‌లు, పీఈటీల పదోన్నతులు, సీపీఎస్ రద్దు, 317 జీవో బాధితుల సమస్యలు మొదలగునవి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రాచకొండ ఉపేందర్, సజ్జనము విద్యాసాగర్, ఉప్పలయ్య, వాగ్యా, శ్రీనివాస్, వీరన్న, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 3 : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయులు బిల్లులను వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్-యూటీఎఫ్) జిల్లా ఆడిట్ కమిటీ బాధ్యుడు బి.హరినాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు వెంటనే చెల్లిస్తామని చెప్పి రెండునెలలు కావస్తున్నా నేటి వరకు వాటి విడుదల చేయలేదని, వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవ, శ్రీనివాస్, ప్రసాద్, భరత్‌కుమార్, రాంజీ, కుమార్, నాగేశ్వర్‌రావు, వీరస్వామి పాల్గొన్నారు.

'నోపా' క్యాలెండర్ ఆవిష్కరణ

కేసముద్రం, ఫిబ్రవరి 3 : నాయీ బ్రాహ్మణ ఆఫీషియల్ అండ్ ప్రొఫెషనల్(నోపా) ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను కేసముద్రంలో శనివారం మండల నాయీబ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లింగాల నేతాజి, మడిపెల్లి కృష్ణమూర్తి, లింగాల సుదర్శన్, జంపాల విక్రం, రమేష్, నర్సయ్య పాల్గొన్నారు.